
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 25 డిసెంబరు 2024



రేపు నగరంలో సీపీఐ ఆవిర్భావ సభ

ఖమ్మంటౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం ఖమ్మంలో ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10గంటలకు పాత కలెక్టరేట్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ఎర్రకవాత్ నిర్వహిస్తామని అనంతరం కళాక్షేత్రంలో సభ నిర్వహిస్తామన్నారు. తొలుత ఇందిరానగర్‌లో పైలాన్ ఆవిష్కరణ ఉంటుందని వివరించారు. సభలో పార్టీ నేతలు కూనంనేని సాంబశివరావు, పువ్వాడ నాగేశ్వరరావు, పశ్య పద్మ తదితరులు పాల్గొంటారన్నారు.



ఖమ్మంలో ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, ఇతర నేతలు

కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

- అంబేద్కర్‌పై అమిత్‌షా విమర్శలు దేశానికే అవమానకరం
- ఉప ముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- డీసీసీ కార్యాలయం నుంచి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ

ఖమ్మం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవుల్లో కూర్చున్న మోదీ, అమిత్‌షాలు ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తూ పాలన సాగిస్తున్నందున కేంద్ర ప్రభుత్వాన్ని రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి జడ్పీ(అంబేద్కర్) సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ (మిగతా 6వ పేజీలో)



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల, భట్టి



కరుణగిరిలోని క్యాథలిక్ చర్చిలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకల్లో బిషప్ సగిలి ప్రకాశ్ సందేశం

కరుణామయుడి రాక

- నేడు క్రిస్మస్ పర్వదినం
- అర్ధరాత్రి నుంచే మొదలైన ప్రార్థనలు
- సామూహిక వేడుకలకు ముస్తాబైన చర్చిలు

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర క్రిస్‌మస్ పర్వదినాన్ని క్రైస్తవులు బుధవారం జరుపుకోనున్నారు. పవిత్ర ప్రార్థనల కోసం ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా చర్చిలు వెలుగు జిలుగులతో అలరారుతున్నాయి. ఖమ్మం నగరం చర్చ్ కాంపౌండ్ లోని పురాతన సీఎస్ఐ చర్చితో పాటు, ఆర్‌సీఎం, పెంతెకోస్తు తదితర చర్చిలు, నాయుడుపేటలోని కరుణగిరి చర్చి తల్లాడ, వైరా , మధిర, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో క్రైస్తవ భక్తులతోపాటు క్రైస్తవ మిషనరీల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రీస్తు విశ్వాసులు బుధవారం పండుగ నిర్వహణకు సిద్ధమయ్యారు.. మానవాళిని కాచి, కాపాడేందుకు బాలఏసు దివినుంచి భువికి దిగివచ్చిన పవిత్ర దినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పర్వదినాన్ని పాటిస్తారు. పండుగలో భాగంగా ఇళ్లను స్టార్‌లతో విద్యుత్ దీపాలతో క్రిస్‌మస్ ట్రీలతో (మిగతా 6వ పేజీలో)



ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

చిరు జల్లులతో పరేషాన్

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు
- వానకు తడవకుండా రైతుల అవస్థలు
- పలు చోట్ల ధాన్యంతో పాటు పత్తికి నష్టం

ఖమ్మం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏపీలో వాయుగుండం తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో కూడా చూపిస్తుంది. మంగళవారం సాయంత్రం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పలుచోట్ల మబ్బులతో ముసురు కమ్మి వర్షం పడింది. చీకటిమబ్బులతో పాటు చలిగాలులు, వర్షంతో జనం తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యంతో పాటు అక్కడక్కడ వరిపొలాల్లో ఉన్న వరి కూడా వర్షం కారణంగా తడిచింది. కొంతమంది ముందే అప్రమత్తమై టార్పాల్స్ కప్పుకొన్నారు. చేలో పత్తి కూడా తడిచింది. ఈవర్షం వల్ల ధాన్యం, పత్తికి కొంత ధర తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. పేర్కొంటుంది. ఈవర్షం మరింత పెరిగితే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. జిల్లాలో మంగళవారంసాయంత్రం కురిసిన వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. (మిగతా 7వ పేజీలో)



భద్రాచలంలోని మిథిల స్టేడియంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ముక్కోటికి పకడ్బందీ ఏర్పాట్లు

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- వేడుకల ఏర్పాట్లు, గిరిజన మ్యూజియం పరిశీలన

భద్రాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వైకుంఠ ద్వార దర్శనం అందరికి కనపడేలా ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో ముక్కోటి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం ద్వారా స్వామి వారి దర్శనం కాగానే, స్వామివారిని దర్శించుకోవడానికి వెళ్లే భక్తులు తొక్కిసలాటకు గురి కాకుండా రెవెన్యూ, పోలీసు శాఖ వారు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం తెప్పోత్సవం జరిగే ప్రదేశాలను పరిశీలించి ఈ సంవత్సరం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఆదివాసీ గిరిజనులకు సంబంధించి సంస్కృతి, వంటకాలు, సంప్రదాయాలు తెలియజేసే విధంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి కరకట్ట ప్రదేశంలో ప్రత్యేక స్టాల్స్‌లో ఆదివాసీల కళలకు సంబంధించిన క్రాఫ్ట్స్, ఆదివాసీ వంటకాలు, (మిగతా 7వ పేజీలో)

అదో సుందరమైన దృశ్యం. సృష్టి అద్భుతం. కొండ కోనల్లో.. లోయల్లో తెలి మంచు వేళ ఘల్లు ఘల్లున అందెల రవంతో ప్రకృతి కన్య అడుగుల సవ్వడికి గుండె జల్లుమనాల్సిందే. పచ్చని మేనితో రంగురంగుల వాలు పూల జడలో ఈ అడవి బిడ్డ అడుగులో అడుగేస్తుంటే.. కోయిలమ్మ పిలుపులు.. గువ్వల గుసగుసలు.. పిట్టల కిలకిలారావాలు, నీటి మడుగుల గలగలలు ఈ అనుభూతి ఓ అద్భుతం. కలానికి దొరకని కవి మది ఘోష ఇది. ఈ సుందర దృశ్యమాలికను కనులారా వీక్షించాలంటే.. అశ్వారావుపేట అడవుల్లోకి వెళ్లాల్సిందే.. నిండైన జలాశయాలు ఎండిపోయే మండు వేసవిలో కూడా ఓ బండరాయిపైన ఉన్న కొండమామిడి వేళ్ల నుంచి నిత్యం జాలువారే జలం. ఆ జలంతో ఆ పరిసరాల్లో ఏర్పడిన నీటి మడుగులు. నిజంగా అద్భుతమే కదా.. చెట్టు వేరు నుంచి జాలువారే జలంతో ఏర్పడిన నీటి నిల్వలను ఆ ప్రాంతంలో జీవించే కొండరెడ్లు 'జలగుండాలు'గా పిలుస్తుంటారు. ఇది నిజంగా సృష్టి మహిమ అని గిరిజనులు భావిస్తుంటారు.

- నిండువేసవిలో కూడా పుష్కలంగా నీరు
- రాళ్లపై కొండ మామిడి చెట్టు నుంచి ఊట..
- పరిసరాల్లో వట్టిపోతున్న వాగులు
- చెట్టు ప్రాంతంలో మాత్రం నీటి మడుగులు
- సృష్టి విచిత్రం అంటున్న గిరిజనులు



సెలయేటికి చలో

రెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో జలగుండం

అడవి తల్లి ఒడిలో..

జల సవ్వడి

చెట్టు వేళ్ల నుంచి జాలువారే నీరు

అశ్వారావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలం, పాతరెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో కనిపించే అద్భుతమైన దృశ్యం 'జలగుండం'. పెద్ద రాతిబండపై కొండ మామిడి చెట్టు(అడవి మామిడి) మొలవడమే ఓ అద్భుతమంటే.. ఆ చెట్టు మొదట్లోని వేర్ల నుంచి నిత్యం నాలుగైదు చేతి వేళ్ల మందం నీరు జాలువారుతూనే ఉంటుంది. ఏదో వర్షాకాలంలో ఇలా జరుగుతుందనుకుంటూ పొరపాటే. నిండి వేసవిలో పరిసరాల్లోని వాగులు ఎండిపోయిన సమయంలో కూడా ఈ వేర్ల నుంచి అదే రీతిలో నీటి జాలు వస్తూనే ఉంటుంది. ఈ నీరు పరిసరాల్లోని గుంతల్లో చేరి నిల్వ ఉంటాయి. ఈ జలంతో ఏర్పడిన గుంతలు కావడంతో వీటిని ఆ ప్రాంత గిరిజనులు జలగుండంగా పిలుస్తుంటారు.

కొర్రాజుల దేవుడి మహిమేమో..

వేసవి వచ్చిందంటే ఈ జలగుండాన్ని చూసేందుకు పరిసరాల్లోని ప్రజలు తరలివెళతారు. ఒకవైపు జలగుండం, మరో వైపు చుట్టు దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నాయి. జలగుండానికి ఎదురుగా ఎత్తైన కొండపై నాయకపోడు కుల దైవమైన కొర్రాజులు దేవుడు కొలువై ఉన్నాడు. ఆ దేవుడి మహిమతోనే ఈ గుండం ఏర్పడిందని గిరిజనులు భావిస్తుంటారు. చల్లగ, మధురంగా ఈ జలం ఉంటుంది. కొర్రాజులు దేవుడిని గ్రామాల్లో జాతరకోసం కొండపైనుంచి దింపినప్పుడు ఈ జలగుండాలలోనే స్నానమాచరింపచేసి గ్రామాలల్లోకి తీసుకెళతారు.

ఈ అటవీ ప్రాంతంలో వేసవి కాలంలో జంతువులకు ఈ జలగుండాలే తాగునీటికి ఆధారం. ఈ దృశ్యాలను చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. ఇలాంటి ప్రదేశాలను ప్రభుత్వం గుర్తించి పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తే మంచి ఆదరణ లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అడవుల్లో ఇలాంటి విచిత్రమైన దృశ్యాలు ఎన్నో కనిపిస్తుంటాయి. బాహ్య ప్రపంచానికి తెలియని అద్భుతాలలో ఆదో దృశ్యమని ఈ ప్రాంత ప్రజలు భావిస్తుంటారు.



చెట్టు వేళ్ల నుంచి వస్తున్న జలం

పూర్వ వీఆర్వోలను రెవెన్యూలోకి

తీసుకోవడం హర్షణీయం

- రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీర్వోల సంఘం నాయకుడు ఉపేంద్రరావు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ చరిత్రలో భూ భారతి ఓ మైలురాయిగా నిలుస్తుందని, రెవెన్యూ శాఖలోకి పూర్వ వీఆర్వోలను తీసుకోవడం హర్షనీయమని వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు అన్నారు. మంగళవారం వీఆర్వోల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేంద్రరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దు కావడంతో రెండున్నర సంవత్సరాలుగా మానసిక వేదనతో ఆందోళనలో ఉన్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,139 మంది వీఆర్వోల కుటుంబాలకు అండగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వీఆర్వోలను రెవెన్యూలోకి ఆప్షన్ పద్ధతిలో తీసుకుంటూ నిర్ణయించడం హర్షనీయమని అన్నారు. గత ప్రభుత్వం వీఆర్వోలను రెవెన్యూ శాఖ నుంచి విడదీయడమే కాకుండా గ్రామస్థాయి రెవిన్యూ రద్దుచేసి వీఆర్వోల భవిష్యత్తును అంధకారంలో నెట్టిందన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోకి రాత్రికి రాత్రే బలవంతపు సర్దుబాటు చేయడం వలన ప్రభుత్వ ఉద్యోగుల సీసీఏ రూల్స్, ఫండమెంటల్ రూల్స్ కు విరుద్ధంగా తీసుకున్న గత ప్రభుత్వ నిర్ణయం వలన వీఆర్ఓలు సర్వీసు, పే ప్రొటెక్షన్, పదోన్నతులు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

డీగ్రేడ్ చేసి అటెండర్లుగా, కామాటిగా, వంట కుక్కు, స్వీపర్లుగా, మహిళా జీపు డ్రైవర్‌గా సర్దుబాటు చేశారన్నారు. ప్రభుత్వం వీఆర్వోల న్యాయమైన గత సర్వీసును పరిగణలోకి తీసుకొని కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలని ముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు చీమల నాగేంద్రబాబు, బంక కృష్ణ, షేక్ జానీమియా, వజ్జ రామారావు, చర్ల శ్రీనివాస్, ధరావత్ భాస్కర్, కిషోర్, నెల్లూరు లవన్ కుమార్ , బంక భాస్కర్ శ్రీ వాణి, మల్లీశ్వరి, వాంకుడోత్ వెంకన్న, వస్రాం,ధన్నూరి బాలరాజు, చిట్టి మల్ల నాగేశ్వరరావు, షేక్ నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు .

పెనగడపను ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతాం

- సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సమీప గ్రామమైన పెనగడపను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. సింగరేణి ప్రభావి ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసం ఎన్ని నిధులైన కేటాయించేందుకు వెనుకాడేది లేదని ప్రకటించారు. మంగళవారం పెనగడప గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను సమకూర్చుతామని తెలిపారు. ప్రతి ఇంట్లో మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించేవిధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులను కోరారు. గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం, లైబ్రరీ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, చెక్‌డ్యాం నిర్మాణం చేపడతామని తెలిపారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమీపంలోని చెరువును సందర్శించారు. చెరువు అభివృద్ధి కోసమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



చైర్మన్‌ను అభినందిస్తున్న గ్రామస్థులు

జాతీయ బాల్‌బ్యాడ్మింటన్

పోటీలకు మధులత



బోనకల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 తేదీ నుంచి 29 వరకు మహారాష్ట్రలోని నాగపూర్ రైల్వే స్టేడియంలో జరగనున్న 70వ సీనియర్ మహిళల జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుతున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కె. మధులత ఎంపికైంది. వరంగల్ జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ క్రీడా ప్రతిభను కనబరిచిన మధులతను జాతీయస్థాయి శిక్షణా శిబిరానికి ఎంపిక చేశారు. ఆటలో ఎడమచేతి వాటం కలిగిన అరుదైన క్రీడాకారిణి కావడంతో పాటు ఎఫెన్స్ డిఫెన్స్ విభాగాలలో మంచి నైపుణ్యం కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గతంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పలుసార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారి ఈమె ఎంపిక పట్ల కోచ్ అమరేసి లింగయ్య, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పద్మావతి, పీడీ సంధ్యారాణి అభినందనలు తెలిపారు.

కొత్తగూడెం వాసికి

భారతరత్న సేవా పురస్కారం



పురస్కారాన్ని గెర్షోంకు అందజేస్తున్న మాతృఫౌండేషన్ సభ్యులు

కొత్తగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గాంధీపథం గెర్షోం ఛారిటబుల్ సర్వీసు అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోంకు అరుదైన భారతరత్న సేవ పురస్కారం లభించింది. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు (సోషల్ సర్వీసెస్) అందించినందుకు చింతలచెర్వు గెర్షోంకు కర్ణాటక రాష్ట్రంలోని బల్లారి జిల్లాలో శ్రీ మాతృ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు భారతరత్న సేవా పురస్కారం- 2024ను సోమవారం సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గెర్షోం మాట్లాడుతూ ఈ పురస్కారం లభించడం పట్ల సంతోషంగా ఉందన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మంత్రి తుమ్మల



క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ముస్తాఫానగర్‌లోని బేరాక్ చర్చిలో మంగళవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాంతియుత సమాజం కోసం జీసెస్ రక్తం చిందించారని ఆయన చూపిన దారిలో ప్రతి ఒక్కరూ శాంతి సందేశంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం

కార్యకర్తల పోరాటాల వల్లే అధికారం

- ఇంటింటికి ఇందిరమ్మ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కాంగ్రెస్ గ్రామశాఖల అధ్యక్షులతో భేటీ

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు పదేళ్ల పాటు అనేక పోరాటాలు చేసి ప్రజల్లోకి వెళ్లటంతోనే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని, ప్రజలకు కార్యకర్తలు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాల గ్రామశాఖల అధ్యక్షుల ప్రత్యేక అంతర్గత సమావేశంలో భట్టి విక్రమార్క సుదీర్ఘంగా మాట్లాడారు. మండలాలు, గ్రామాల వారీగా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాల్లో ఏలా అమలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ అమలు జరిగే విషయం గ్రామ కాంగ్రెస్ నాయకులకు అధికారులు చెపుతున్నారా.. అని ప్రశ్నించారు. పోలీసుస్టేషన్‌ల్లో ఇంకా బీఆర్ఎస్ నాయకుల మాటలే చెల్లుబాటు అవుతున్నాయని ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల సమయంలో బూత్ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు అమలుపై వివరించటంతోనే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు(మౌత్ టాక్) మాటల ద్వారానే వివరించాలని కోరారు. జనవరి 1 నుంచి ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల జాబితాలతో కూడిన ఫ్లెక్సీలను అధికారులు ఏర్పాటు చేస్తారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. అర్హత కలిగిన రైతుల జాబితాలను మండల అధ్యక్షుల ద్వారానే పంపితే అధికారుల ద్వారా విచారణ చేయించి అర్హత కలిగిన వారికి రైతు రుణమాఫీ అమలు చేస్తామన్నారు.



గ్రామశాఖ అధ్యక్షులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

క్రికెట్‌లో త్రిష మెరుపులు

- అండర్-19 టీ20 ప్రపంచ కప్ జట్టుకు ఎంపిక
- ఏషియా కప్‌లో జట్టు విజయంలో కీలక పాత్ర
- స్వస్థలం భద్రాచలం కీర్తిని చాటుతున్న క్రీడాకారిణి





భద్రాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలానికి చెందిన జి.త్రిష క్రికెట్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ జన్మభూమికి కీర్తిని తీసుకువస్తోంది. జనవరి 18 నుంచి జరగనున్న మహిళల అండర్-19 టీ-20 వరల్డ్‌కప్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. ఇందులో త్రిష స్థానం దక్కించుకోవడం విశేషం. ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన అండర్-19 టీ-20 ఆసియా కప్‌లో త్రిష విశేషంగా రాణించింది. 47 బంతుల్లో 52 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. దీంతో ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా త్రిష ఎంపికైంది. ఈ క్రమంలో జనవరి నుంచి జరగనున్న మహిళల అండర్-19 టీ-20 వరల్డ్‌కప్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టులో గొంగడి త్రిషకు చోటు దక్కింది.

తండ్రి ఆకాంక్షను నెరవేర్చే దిశగా

త్రిష తన తండ్రి గొంగడి రాంరెడ్డి ఆకాంక్షను నెరవేర్చే దిశగా మహిళ క్రికెట్‌లో రాణిస్తోంది. చిన్ననాటి నుంచి తన కుమార్తెను భారత మహిళ జట్టు క్రీడాకారిణిగా చూడాలనేది రాంరెడ్డి స్వప్నం. క్రికెట్‌లో ఓనమాలు భద్రాచలంలో నేర్చుకున్న త్రిష అనంతరం మరింత మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ సమయంలో ప్రసిద్ధ కోచ్‌ల వద్ద శిక్షణ ఇప్పించి క్రికెట్‌లో రాణించేందుకు మార్గాన్ని సుగమం చేశారు.

ఇప్పటికే ప్రతిభను చాటిన త్రిష

త్రిష అండర్-16లో రాష్ట్ర జట్టుకు 2012-13లో ఎంపికైంది. అలాగే అండర్-19, అండర్-23లలో ఓపెనింగ్ బ్యాట్స్ ఉమెన్‌గా, లెగ్ స్పిన్నర్‌గా రాణించి ప్రస్తుతం సీనియర్స్‌లో ఆడుతోంది. 2018లో నేషనల్ క్రికెట్ అకాడమీ జట్టుకు ఏప్రిల్ నెలలో ఆమె ఎంపికైంది. అకాడమీ చైర్మన్ నిరంజన్‌షా, డైరెక్టర్ దిలీప్ వెంగసర్కార్‌లు ఆమెను 12 మంది జట్టు సభ్యుల్లో ఒకరిగా ఎంపిక చేయడం విశేషం. ఇటీవల అండర్-19 మహిళల ఆసియా కప్ టీ-20 క్రికెట్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన త్రిష జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది.

ఫ్లెక్సీపైన 'రక్షణమంత్రి'గా అమిత్‌షా

- కాంగ్రెస్ నిరసన ర్యాలీలో విచిత్రం
- సోషల్ మీడియాలో వైరల్



ఫ్లెక్సీలో అమిషా శాఖను రక్షణశాఖగా పేర్కొన్న దృశ్యం

ఖమ్మం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ ఫ్లెక్సీలో ఏకంగా కేంద్రమంత్రి అమీత్‌షా శాఖనే మార్చేశారు. కేంద్ర హోం శాఖ బదులుగా కేంద్ర రక్షణశాఖా మంత్రి అని రాయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు నాయకులు పా ల్గొన్న ఈ నిరసన ర్యాలీ ఫ్లెక్సీని ముందుభాగంలో అందరూ పట్టుకొని నిరసన నిర్వహించా రు. ఏకంగా కేంద్ర మంత్రి శాఖనే మార్చి ఫ్లెక్సీలో రక్షణ మంత్రిగా అమిత్‌షా పేరు రాయడం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

కరుణామయుడి రాక

(5వ పేజీ తరువాయి)

అలంకరించుకున్నారు. బాల ఏసు చిత్రాలను తదితర ఘట్టాలను తెలియజేసే విధంగా ఇళ్లల్లో, చర్చిలలో ఏర్పాట్లు చేశారు. స్నేహితులకు, బంధువులకు క్రిస్మస్ గ్రీటింగులను పంచారు. పండుగ సందర్భంగా తమ చర్చిలను అలంకరించుకోవటంతో విద్యుత్‌వెలుగుల్లో కళకళలాడుతున్నాయి.

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సీఎస్ఐ చర్చిలో బుధవారం ఉదయం నాలుగు గంటలకు క్రిస్మస్ ప్రత్యేక ఆరాధన సర్వీస్ ప్రారంభించి పాస్టర్లు దైవ సందేశాన్ని భక్తులకు వినిపించనున్నారు. పలు చర్చిల్లో యేసు క్రీస్తు పుట్టిన ఇతి వృత్తాంతాన్ని ప్రదర్శించేలా పశువుల పాక (క్రిబ్)ను యూత్ సభ్యులు ఏర్పాటు చేశారు. చుంచుపల్లి మండలంలోని ఎస్ఆర్ డీజీ ప్రైమ్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ఆర్‌సీఎం చర్చిలో బుధవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

కరుణగిరిలో క్రిస్మస్ వేడుకలు

ఖమ్మం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరుణగిరి పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైయ్యాయి. ఖమ్మం పీఠాధిపతులు బిషప్ సగిలి ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాలనుంచి క్రైస్తవులు పెద్ద ఎత్తున హజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.



కరుణగిరి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఖమ్మంలోని ఆర్సీఎం చర్చిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో పాస్టర్లు)

కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, అంబేద్కర్ ఫ్లెక్సీలు చేబూని నిరసన ర్యాలీ సాగించారు.

అనంతరం జడ్పీసెంటర్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో భారతదేశ ప్రజాస్వామ్య మనుగడకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆదర్శంగా నిలిచిందని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగా ఏర్పడిన పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఆ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న మోదీ, అమిత్‌షా తీరును దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వాన్ని రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలు భారతజాతి తలదించుకునేలా చేసిందని, ఆయనపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈనిరసన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలతో పాటు ఖమ్మంలోని కాంగ్రెస్ కార్పొరేటర్లు, యువజన, మహిళ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఏపీ గ్రామాల్లో రెండు రాష్ట్రాల

ఎక్సైజ్ అధికారుల దాడులు

» 180 లీటర్ల నాటుసారా స్వాధీనం » 18,500 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం

భద్రాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సరిహద్దుల్లోని ఏపీకి చెందిన యటపాక మండలంలో ఉన్న గుండు వారిగూడెం, పిచుకలపాడు గ్రామాల్లో రెండు తెలుగు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంటు కమిషనర్ జి.గణేష్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర సరిహద్దుల్లో నాటుసారా నిర్మూలన దాడుల్లో భాగంగా రెండు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 180 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోగా, 18,500 లీటర్ల నాటుసార తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రెండు గ్రామాల ప్రజలను నాటుసారా తయారీకి పాల్పడి విక్రయించడం, రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏపీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్. మధు, భద్రాద్రి జిల్లా అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు పి.నాగరాహుల్, ఎస్కే రహీమున్నాసాబేగం, రమేష్, శ్రీనివాసరావు, ఇంద్రజీత్, వై.స్వామి, కిషోర్, కె.గౌతమ్, పార్థసారధి, గణేష్, భాను, సత్యనారాయణ పాల్గొన్నారు.

అడవి అలుగను తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

దుమ్ముగూడెం డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం రేంజి అడవుల్లో నుంచి అడవి అలుగను తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై అటవీశాఖ అధికారులు మంగళవారం వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. రేంజి అధికారి కమల వెల్లడించిన వివరాల ప్రకారం.. దుమ్ముగూడెం మండలం పెదనల్లబల్లికి చెందిన కొత్తపల్లి బాలకృష్ణ, సారపాకకు చెందిన నాదెళ్ల వెంకట్రావు, ఏటూరునాగారానికి చెందిన గోపాల్ అడవి వాలుగను విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దుమ్ముగూడెం అడ్డ రోడ్డు వద్ద ఈనెల 23న రాత్రి కాపుకాసి పట్టుకున్నారు. గౌరారానికి చెందిన శ్యామల వెంకటేశ్వరరావు తన ఇంటి వద్ద వాలుగను కొద్ది రోజులు సంరక్షించగా, అతడిపై సైతం కేసు నమోదైంది. గోపాల్ పరారీలో ఉండగా, బాలకృష్ణ, వెంకట్రావు, వెంకటేశ్వర్లును కోర్టులో రిమాండ్ చేశారు.

తెలంగాణా, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ అడవుల్లో మాత్రమే అరుదుగా కనిపించే ఈ వాలుగ చర్మంపై పొలుసులను ఔషదం తయారీలో వాడతారనే అపోహ మేరకు విక్రయించేందుకు వీరు అక్రమంగాతరలిస్తున్నారు. జీవిని పట్టుకునే క్రమంలో గాయపడిందని, చికిత్సల అనంతరం మరలా అడవుల్లో వదిలేస్తామని రేంజి అధికారి తెలిపారు.

రేపు, ఎల్లుండి భద్రాచలంలో గిరిజన సెమినార్

» జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ఆవిర్భావ వేడుకలు

» మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర



మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

పినపాక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం 50వ ఆవిర్భావ ఉత్సవాలను జయప్రదం చేయాలని, ఆదివాసీల హక్కుల కోసం చట్టాల కోసం 1974లో ఏర్పడిన జాతీయ ఆదివాసీ గిరిజన సంఘం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఈ నెల 26, 27 తేదీల్లో భద్రాచలంలో రెండు రాష్ట్రాల సెమినార్ నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు, జడ్పీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర తెలిపారు. మంగళవారం పినపాక, ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమవేశంలో ఆ యన మాట్లాడుతూ గిరిజన అభ్యదయ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం పోరాటాల, ఉద్యమాల ఫలితంగా ఆదివాసీ హక్కులు, చట్టా లు ప్రజల్లో చైతన్యం ఏర్పడ్డాయని దాని ఫలితంగానే జీవో 3 ద్వార వందలాది, వేలాదిమంది ఉద్యోగులు పొందారని గుర్తుచేశారు. సమావేశానికి ఆదివాసీ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యమ, ఉద్యోగ, విద్యార్థి, మహిళా సంఘాలు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై సెమినార్‌ను జయప్రదంచేయాలని కోరారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, అతిథులుగా ఆదివాసీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. సమవేశంలో జాతీయ ఆదివాసీ అభ్యదయ సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు వజ్జ నర్సింహారావు దొర, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర, భద్రాచలం డివిజన్ నాయకులు సోయం శుక్రాం, పినపాక మండల అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు మేరకు

విద్యుత్ సామర్థ్యం పెంపు

టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు నూతనంగా ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను నిర్మాణం చేశామని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ తెలిపారు. మంగళవారం ఖమ్మంలో విలేకర్లతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. రానున్న రోజుల్లో మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది విద్యుత్ వినియోగం ఆధారంగా వచ్చే వేసవికి అంచనా గణంకాలను రూపొం దించి విద్యుత్ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. మెరుగై న, అంతరాయం లేకుండా విద్యుత్ పంపిణీ కోసం 33కేవీ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను నిర్మాణం చేశామన్నారు. ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో లోడ్ బదాలాయింపునకు చర్యలు చేపట్టామని వివరించారు. 11కేవీ ఫీడర్ లైన్ లోపాలను ముందస్తుగా గుర్తించి తగిన నిర్వాహణ పనులు చేపట్టామని తెలిపారు. ఇటీవల కాలంలో 655 ట్రాన్స్ ఫార్మర్‌లకు నిర్వహణ చేపట్టి అందుబాటులో ఉంచామన్నారు. వేసవి కాలంలో బ్రేక్‌డౌన్ లేని విద్యుత్ పంపిణీకి కార్యచరణ ప్రారంభించామన్నారు.

శోభ కోల్పోయిన 'హరిత'..



» హోటల్‌కు సరికొత్త రూపు తీసుకొచ్చేందుకు కసరత్తు

» నవమి నాటికి సిద్ధం చేయాలని యోచిస్తున్న పర్యాటక అధికారులు

భద్రాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో ఉన్న తెలంగాణ పర్యాటక శాఖ హరిత హోటల్‌కు సరికొత్త రూపు తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.12 కోట్లతో రెండు దశాబ్దాల క్రితం ఈ హోటల్‌ను నిర్మించారు. ప్రస్తుతం హోటల్‌లో 57 గదులుండగా అందులో సుమారు 15 గదులు పర్యాటకులు, భక్తులు ఉండేందుకు అనువుగా లేనట్లు తెలుస్తోంది. వర్షాకాలం వస్తే మొదటి అంతస్తులో చాలా గదులకు పైన సీలింగ్ పాడైపోవడంతో వర్షపు నీరు గదుల్లోకి వస్తోందని సమాచారం. అలాగే కొన్ని గదులకు గుమ్మాలు చెదలు పట్టడం, తలుపులు పాడవడంతో గదులు అద్దెకు తీసుకున్న వారు తమ రివ్యూల్లో నిర్వహణ లోపాలపై ఫిర్యాదులు చేస్తున్నట్లు వినికిడి. అలాగే 30 మంది వరకు సిబ్బంది కావాల్సి ఉండగా ప్రస్తుతం 12 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఏడాది కాలంగా నిర్వహణ సమస్యలు పెరుగుతూ వచ్చినట్లు తెలిసింది.

ఇటీవల పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి పర్యటన సమయంలో హోటల్‌కు సరికొత్త రూపు తెచ్చేందుకు ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సంబంధిత పర్యాటకశాఖ ఇంజనీరింగు అధికారులు ఇందుకు సంబంధించి ప్రాథమిక అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు సమాచారం.

సరికొత్త రూపు తీసుకొచ్చే కసరత్తు

నాలుగు రాష్ట్రాల కూడలిలో ఎంతో కీలకమైన హరిత హోటల్‌కు ఎంతో డిమాండ్ ఉంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులు సైతం హోటల్‌కు సరికొత్త రూపును తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది.

హోటల్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి నూతన హంగులతో భక్తులు, పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని అనుకున్నట్లు జరిగితే శ్రీరామనవమి నాటికి పూర్తిస్థాయిలో ముస్తాబయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భారీగా తగ్గిన ఆదాయం

2002లో హరిత హోటల్ పనులకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా 2005లో అప్పటి కేంద్ర, రాష్ట్ర మంత్రులు రేణుకా చౌదరి, గీతారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆరంభంలో భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులతో పాటు పాపికొండలు, పేరంటాలపల్లి పర్యాటకులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇందులో బస చేసిన సమయంలో గతంలో నెలకు సుమారు రూ.18 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రూ.12 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం కూడా వారంతపు సెలవుల్లో గదులు ఆన్‌లైన్‌లో బుక్ అవుతున్నట్లు తెలుస్తోంది.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ అధిక ప్రాధాన్యం

» డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల » తూకంలో తేడా రావొద్దని ఆదేశం

నేలకొండపల్లి, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్వాల తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యం నాణ్యతను, తేమ శాతాన్ని పరిశీలించారు. తూకం ఖచ్చితంగా ఉండాలన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. రూ.2లక్షల రుణం ఉన్న రైతుల రుణాన్ని ఒకే దఫా మాఫీ చేసిన ఘనత రేవంత్ సర్కార్‌దేనన్నారు. త్వరలోనే రైతు భరోసాను రైతులకు అందించనున్నట్లు కొత్వాల చెప్పారు. అనంతరం ఏఎంసీ పాలకవర్గం డీసీఎంఎస్ చైర్మన్‌ను సత్కరించారు.

కార్యక్రమంలో చైర్మన్ వెన్నపూసల సీతారాములు, కార్యదర్శి ఎన్.నాగేశ్వరి, డీసీఎం ఎస్ డైరెక్టర్ డాక్టర్ నాగబండి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, బోదులబండ సొసైటీ అధ్యక్షుడు అనంతు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులతో పరేషాన్

(5వ పేజీ తరువాయి)

వరికోతలు దాదాపు పూర్తి కావటంతో వేలాది క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉంది. తేమశాతం కోసం రైతులు రోజుల తరబడి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో చిరుజల్లులు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కురుస్తున్న వానలకు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవటం రైతులకు కష్టతరంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి వసతులు లేకపోవటంతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి చేలల్లో కాయ విడిపోయి పత్తి తీతకు సిద్ధంగా ఉంది.

వర్షం వల్ల పత్తి తడిచి నల్లబడి నాణ్యతపై ప్రభావం చూపుతుంది. మామిడి, జీడి మామిడి పూత కొనలపై ఉంది. ఈసమయంలో వర్షం పడటంతో కొమ్మలు ఇగురులు వేసి పూత రాకుండా పోయే అవకాశాలున్నాయనే ఆందోళన వ్యక్తం అవుతుంది. భారీ వర్షం నమోదు అయితే కోతకు వచ్చివున్న పుచ్చ, వేరుశెనగ వంటి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో కనిపిస్తుంది.

నేడు, రేపు మార్కెట్ బంద్

ఖమ్మంమార్కెట్ , డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు బుధ, గురువారాలు వరుసగా రెండు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 క్రిస్మస్, 26 బాక్సింగ్‌డే సందర్భంగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 27 శుక్రవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

నేడు మంత్రి పొంగులేటి రాక

» రెండు రోజుల పాటు పర్యటన » పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధ, గురువారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 7గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి 11.30కి వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని ఒంటి గంటకు కల్లూరు మండలం నారాయణపురం చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

గురువారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గున్నేపల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, దమ్మపేట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటికి శంకుస్థాపన చేస్తారు. తర్వాత అశ్వారావుపేట మండలం కేశప్పగూడెంలో మేడికొండ రోడ్డుపై హైలెవల్ బ్రిడ్జికి, ములకలపల్లి మండలం కొత్తూరులో హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తారు. తర్వాత సత్తుపల్లి పట్టణంలో స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని, పెనుబల్లి గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం కల్లూరు మండలం పాయపూరు గ్రామంలో, తల్లాడ మండలం పినపాక గ్రామం అంబేద్కర్ నగర్‌లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.15కి ఖమ్మం చేరుకుని ఇంట్లో బస చేస్తారు.

ఆలయ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క » స్వగ్రామం స్నానాల లక్ష్మీపురంలో పర్యటన



నిర్మాణాలను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

వైరా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.3.20కోట్లతో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. స్వగ్రామం స్నానాల లక్ష్మీపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభిషేక, కల్యాణమండపాల నిర్మాణాలను మంగళవారం సాయంత్రం వర్షపుజల్లుల్లోనే సందర్శించి పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ లైట్లను వెంటనే మార్చాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్‌ను ఆదేశించారు. అంతకుముందు ఆలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకట నర్సిరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, నాయకులు, ఏదునూరి సీతరాములు, పొట్లపల్లి నాగేశ్వరరావు, నూతి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, వడ్డే నారాయణ, పొదిల హరినాథ్, పణితి శ్రీను పాల్గొన్నారు.

ముక్కోటికి పకడ్బందీ ఏర్పాట్లు



గోదావరి ఒడ్డున ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

ప్రతి రోజు కల్చరల్ ప్రోగ్రాంలు, వివిధ పాఠశాలల విద్యార్థులతో చేయించాలన్నారు. గోదావరి పరిసరాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో, గిరిజన గ్రామాల్లో తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేసి తగిన వసతులు కల్పించాలన్నారు.

భద్రాచలం ఐటీడీఏ భవన సముదాయంలో గిరిజనులు తయారు చేసే వెదురు ఉత్పత్తులను అమ్మేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముక్కోటి ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఐటీడీఏలో గిరిజన మ్యూజియం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. మ్యూజియం ప్రాంగణంలో నిర్మాణం చేపట్టే పాత కాలపు ఇండ్లలో భక్తులు సేద తీరి ఆదివాసీ వంటకాలు సేవించేలా వెదురుతో తయారు చేసిన సోఫా కుర్చీలు అమర్చాలన్నారు. భక్తులు నేరుగా వచ్చి ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన పదార్థాలు క్రాఫ్ట్ కొనుగోలు చేసి మ్యూజియం సందర్శించాలని అనంతరం బొజ్జిగుప్ప, నారాయణపేట గ్రామాలను సందర్శించి రాత్రి అక్కడే బస చేసి గిరిజన సంస్కృతిని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్‌రావు, ఐటీడీఏ ఏవో సున్నం రాంబాబు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మేనేజరు ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, ఈవో శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, ఐకేపీ ఏపీఎంలు జగదీష్, కిషోర్‌లు పాల్గొన్నారు. కాగా, గోదావరి నది వద్ద కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలిస్తుండగా వికారాబాద్ జిల్లా జీవన్‌పేట గ్రామం నుంచి వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. భద్రాచలంలో స్వామి దర్శనం, పర్ణశాలలో సీతమ్మవారి నార చీరల ప్రాంతం, పాపి కొండల విహార యాత్ర అనుభూతిని పిల్లలనడిగి తెలుసుకున్నారు.

ముంపు ముప్పు ఎంత ?



కిన్నెరసాని వరద ప్రవాహం (ఫైల్)

- **పోలవరం బ్యాక్‌వాటర్‌పై రీసర్వే**
- **మరోసారి ప్రత్యేక సర్వేబృందం ఏర్పాటు చేసిన ఏపీ ప్రభుత్వం**
- **ఇరు రాష్ట్రాల జలవనరులశాఖ నిపుణులతో అధ్యయన కమిటీ**
- **22గ్రామాలు, 3,500 ఎకరాల్లో పంటలకు ముంపు ప్రమాదం**
- **సమగ్ర సర్వేతో న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు**

కొత్తగూడెం/పాల్వంచ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ భద్రాద్రి జిల్లాపై చూపే ప్రభావంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి సర్వే చేపట్టనుంది. పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు ప్రాంతాలపై అధ్యయనానికి నలుగురు సభ్యులతో కూడిన అధ్యయన కమిటీని వేసినట్లు రాష్ట్ర జనవరుల శాఖకు ఏపీ ప్రభుత్వం సమాచారం ఇచ్చిన విషయం విదితమే. ఇరురాష్ట్రాల జలవనరుల నిపుణులతో కూడిన ఈ కమిటీ ఖరారైన వెంటనే భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని, ముర్రేడు పరివాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తారు. గతంలో రెండు దఫాలుగా జరిగిన సర్వేల్లో సర్వేబృందాలు పరివాహక ప్రాంతాల్లో ముంపు భారిన పడ్డ భూములు, గృహాలను పరిశీలించి వెళ్లాయి. అయితే ముంపు ప్రభావంపై సమగ్ర పరిశీలన చేయకపోవడంతో ఆయా ప్రాంతాల బాధిత ప్రజలు పూర్తిస్థాయి సర్వే చేపట్టాలని అనేకసార్లు మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో సర్వే చేసి తగినచర్యలు తీసుకోవాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. సుప్రీంకోర్టు కూడా 2022 సెప్టెంబర్‌లో దీనికనుగుణంగా తీర్పునిచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా ఇరు రాష్ట్రాలకు చెందిన సర్వే బృందం మరోసారి ముంపుపై సర్వే చేపట్టనుంది.

1986లో వరద ఎక్కువ.. ముంపు తక్కువ

గోదావరికి 1986లో రికార్డుస్థాయి వరదలు వచ్చాయి. అప్పుడు గోదావరి వరద 27లక్షల క్యూసెక్కులతో భద్రాచలం బ్రిడ్జి వద్ద 76.5 అడుగుల ఎత్తులో ప్రవహించింది. కానీ అప్పట్లో గోదావరి ముంపు ప్రాంతం తక్కువగానే ఉందని అంచనా వేశారు. లోతట్టు ప్రాంతంలో జలమయమైన గ్రామాలు, ఇళ్ల వందల సంఖ్యలోనే ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. గోదావరికి ఇప్పటివరకు రికార్డుస్థాయి వరద ఇదే.. అప్పటి గోదావరి ప్రవాహంతో కిన్నెరసాని, ముర్రేడు వాగులకు ఎగపోటు వేయలేదు. పరివాహక ప్రాంతాలు మాత్రమే ముంపునకు గురయ్యాయి.

కిన్నెరసాని, ముర్రేడుతో ముప్పు

కిన్నెరసాని ప్రాజెక్టులో 7టీఎంసీల నిల్వ తర్వాత వచ్చిన నీటిని కిందికి విడుదల చేస్తుంటారు. ఎగువన వరద ఉధృతి పెరిగిన ప్రతిసారీ కొన్ని వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుంటారు. కిన్నెరసాని నుంచి వదిలిన నీరు 24కిలోమీటర్ల ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. పాల్వంచ, బూర్గంపాడు మండలాల నుంచి ఏపీలోని వేలేరు మీదుగా గోదావరిలో కలుస్తుంది. అదేవిధంగా ముర్రేడు 14 కిలోమీటర్లు ప్రవహించి వేలేరే వద్దనే కిన్నెరసాని, ముర్రేడు సంగమంగా గోదావరిలో కలుస్తుంది. అలాగే ముర్రేడుకు ఉపవాగులుగా ఉన్న పాములేరు, మూకమామిడి అలుగు, పెద్దవాగు అలుగు నీరు కూడా ముర్రేడులో చేరి గోదావరివైపు పయనిస్తుంది. 2022లో వచ్చిన గోదావరి వరదలతో కిన్నెరసాని, ముర్రేడు పరివాహక ప్రాంతంలో 22 గ్రామాలు, 3,500 ఎకరాల్లో పంటలు ముంపు భారిన పడ్డాయి. ఇక పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పెరిగితే కిన్నెరసాని, ముర్రేడులకు ఎగపోటు మరింత పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2022లో వరద తక్కువ.. ముంపు ఎక్కువ

2022 ఆగస్టులో వచ్చిన వరదలతో గోదావరి ప్రవాహంతో భద్రాచలం వద్ద 24.50లక్షల క్యూసెక్కులతో 71అడుగులకు చేరింది. కానీ 1986లో వచ్చిన 76.5అడుగుల ప్రవాహం కన్నా రెండేళ్ల క్రితం వచ్చిన వరద ఎక్కువ ముంపు ప్రభావాన్ని చూపింది. సుమారు 106 గ్రామాలు ముంపునకు గురి కాగా 20వేల ఇళ్లు నీట మునిగాయి. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతోనే ముంపు ఎక్కువైందని ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలవరం ఎగపోటు వల్ల కిన్నెరసాని, ముర్రేడు వాగుల నీరు వెనక్కి చేరడంతో ముంపు తీవ్రత ఎక్కువైంది. వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 150 అడుగుల మేరకు ప్రాజెక్టులో నీరు నిల్వచేస్తే కిన్నెరసాని, ముర్రేడు నీటి ప్రభావంతో ఈ ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

సర్వే బృందంపైనే ఆశలు..

ఇరు రాష్ట్రాల సర్వే బృందంపై ముంపు ప్రాంతాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ సారైనా సమగ్ర పరిశీలన చేసి నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే వర్షాకాలంలో గోదావరి వరదలు వచ్చే మూడు నెలలపాటు పంటలు వేసుకునేందుకు అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో గృహాలు కోల్పోయిన వారికి మైదాన ప్రాంతంలో వసతి సౌకర్యం కల్పించాలని ఎంతోకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వే బృందంపై ఆయా ప్రాంతాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు

యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

» అధికారులకు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ ఆదేశం » హైదరాబాదులో సమీక్ష



సమీక్షలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

ఖమ్మం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో నిర్మిస్తున్న మున్నేరు వరద నివారణ రిటైనింగ్ వాల్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రెవెన్యూ, నీటిపారుద శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాదులో మంగళవారం మున్నేరుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్ పనులపై సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ అనిల్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ మాట్లాడుతూ మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని కాలనీలకు, గ్రామాలకు వరద రాకుండా ఉండేందుకు చేపట్టిన రిటైనింగ్ వాల్స్ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేందుకు ఇరువైపులా ఆర్‌సీసీ కాంక్రీట్‌గోడలు నిర్మిస్తున్నామని, వరద ప్రవాహాన్ని సక్రమంగా నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సూచించారు. వాల్ నిర్మాణ పనులు మరింత వేగంగా చేపట్టాలని, నెలలో రెండు, మూడుసార్లు పర్యవేక్షిస్తామన్నారు. భూసేకరణ కూడా వెంటనే చేపట్టాలని, ఇందుకు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. నిర్మాణ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే మా దృష్టికి తేవాలని కోరారు. 1969నుంచి 2024 వరకు వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకుని సుమారు 20కి.మీ. మేర వాల్ నిర్మిస్తున్నట్టు మంత్రి పొంగులేటి అధికారులకు తెలిపారు.



సమీక్షకు హాజరైన అధికారులు



30 వరకు ఓపెన్ స్కూల్ తత్కాల్ అడ్మిషన్లకు గడువు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు తత్కాల్ ప్రత్యేక షెడ్యూల్‌ను తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం విడుదల చేసింది. ఈనెల24 నుంచి 30వరకు తత్కాల్ అడ్మిషన్లకు గడువు పెంచినట్లు డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ పాపారావు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ఓపెన్ స్కూల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని, తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. వివరాలకు 8008043522 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
కాకరకాయ	48
బెండకాయ	24
పొట్లకాయ	34
దోసకాయ	38-40
చిక్కుడు	40
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	24
దొండ	60-66
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	68
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	30

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే..
గిరిజన గ్రామాల అభివృద్ధి

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» రఘునాథపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రఘునాథపాలెం,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలోనే తండాలు, గిరిజన గ్రామాల అభివృద్ధి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం రఘునాథపాలెం మండలం మంత్రి తుమ్మల పర్యటించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దొనబండలో 18రహదారులకు రూ.58లక్షలతో అంతర్గత రహదారులకు శంకుస్థాపన చేశారు. తర్వాత ఈర్లపూడిలో మంత్రి తుమ్మలకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగత పలికారు. రూ.1కోటి నిధులతో నిర్మాణం జరగనున్న 33 అంతర్గత రహదారులకు, కొర్లబోడు తండాలో రూ.16లక్షలతో మూడు అంతర్గత రహదారులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల అధికారులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలన్నారు. అటవీహక్కుల చట్టం మేరకు రైతులకు ప్రయోజనాలను కల్పించాలని మంత్రి సూచించారు. వైకుంఠధామాలకు అవసరమైన స్థల పరిశీలన రెవెన్యూ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనంగా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోర్లబోడు తండా గ్రామపంచాయతీకి ప్రహారి నిర్మాణలకు కార్యాచరణ చేయాలని, అంగన్వాడీ భవనాలు, తండాలు, గ్రామాల మధ్య అనుసంధాన రహదారులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. దశలవారీగా అన్ని గ్రామ పంచాయతీల సమస్యలు పరిష్కారం జరుగుతాయన్నారు. జడ్పీ సీఈవో దీక్షారైనా, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దారు లూదర్‌విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీపీఐ శతజయంతి ఉత్సవాలను నిర్వహించాలి

కూసుమంచి,డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఈనెల 26న సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్మూర్తి నాయక్ తెలిపారు. గైగొళ్లపల్లి గ్రామంలో పార్టీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు.

కామన్ సర్వీస్ సెంటర్ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కామన్ సర్వీస్ సెంటర్ వాహన సేవలను సద్వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. మంగళవార జిల్లాకు కేటాయించిన సీఎస్సీ వాహనాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు వారు మాట్లాడుతూ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు, వైద్య, విద్య, ఉపాధి, ఈ మొబిలిటీ, గ్రామీణ ఈ స్టోర్, న్యాయ సేవలు, పర్యాటక, వ్యవసాయ సహకారం, ఇతర రంగాలకు సంబంధించిన సేవలు ప్రజలకు నేరుగా ఉచితంగా అందించేందుకు వీలవుతుందన్నారు. ఈ పథకం క్రింద కామన్ సర్వీస్ సెంటర్ ఈ గవర్నెన్స్ లిమిటెడ్ ద్వారా జీపీఎస్ ఉన్న వాహనం ద్వారా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేయడం, కార్యక్రమాల కోసం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో. రాజేశ్వరి, ప్రాజెక్టు జిల్లా కో ఆర్డినేటర్ షేక్ ఫయాజ్, ఈడీఎం దుర్గాప్రసాద్, జిల్లా మేనేజర్ పి. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూతురి చెంతకు మాతృమూర్తి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కుమారులు, కూతుళ్లు ఉన్నా పట్టించుకోని ఓ వృద్ధురాలిని అన్నంఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కుమార్తె చెంతకు చేర్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురానికి చెందిన ఎనభైఏళ్ల దారెల్లి అంజమ్మకు నలుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మృతి చెందాడు. కూలీనాలి చేసుకొని పిల్లల్ని పెంచి, పెళ్లిళ్లు చేసింది. వారు పట్టించుకోకపోవటంతో సోమవారంరాత్రి కొత్తగూడెం నుంచి రైల్లో సింగరేణి మండలం గాంధీనగర్ చేరుకుంది. ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా స్థానికులు కాపాడారు. అనంతరం అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. పెద్ద కూతురు ముదిగొండ మండలం బాణపురంలో ఉంటోందని చెప్పగా అంబులెన్స్‌లో అన్నం శ్రీనివాసరావు తీసుకెళ్లి కూతురు వెంకటరమణకి అప్పగించారు.

స్మశాన వాటిక రక్షణ పట్ల హర్షం

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి స్మశాన వాటికను కాపాడేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖలు విశేషమైన కృషి చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం 7వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు చింతల ఉపేందర్‌యాదవ్, పొదిల బిక్షం, పాపారావు, దనియాకుల మాధవరావు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు కృతజ్ఞతలు తెలిపారు.

'మద్దులపల్లి మార్కెట్‌ను తక్షణమే పూర్తి చేయాలి'

ఖమ్మంరూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి పంటల క్రయవిక్ర యాలు పూర్తిస్థాయిలో జరిగేటట్లుగా చర్యలు చేపట్టాలని అఖిలభారత యునైటెడ్ కిసాన్ సభ జిల్లా కార్యవర్గం తరుపున జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రూరల్ మండలం, మద్దులపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఎంతో అందుబాటులో ఉంటుందన్నారు. నలుదిక్కుల నుంచి జాతీయ రహదారులు ఉన్నందున రవాణా సౌకర్యం మెరుగుగా ఉంటుందన్నారు. మిర్చి, పత్తి తదితర ప్రధాన పంటలు ఈ ప్రాంతంలోనే ఎక్కువగా పండుతాయన్నరు. రైతుల సౌకర్యార్థం ఈ మార్కెట్ యార్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి పంటల క్రయ, విక్రయాలను కొనసాగించేందుకు చర్యలు చేపట్టాని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, లక్ష్మణ్, నాగేశ్వరావు, హనుమంతరావు, బండెల వెంకయ్య పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబు



ముస్తాబైన కరుణగిరి చర్చి

ఖమ్మంరూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిస్మస్‌వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. పెద్దతండా పరిధిలోని కరుణగిరి చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈవేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. దీంతో ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్థరాత్రి నుంచి కరుణగిరిలోప్రత్యేక ప్రార్థనలు ప్రారంభ మయ్యాయి.

జీళ్లచెరువులో..

కూసుమంచి:మండలంలోని జీళ్లచెరువులో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వీధినంతా రంగురంగులు విద్యుత్ దీపాలతో, నక్షత్రాలతో అందంగా అలంకరించారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలలో మాదిరిపురం, సుబ్లేడు, తిరుమలాయపాలెం, బీరోలు, మేడిదపల్లి, పిండిప్రోలు తదితర గ్రామలోని చర్చిలను అలంకరించారు.





కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, తిరుమలాయపాలెంలో చర్చి..



ఆర్‌సీఎం చర్చిలో సామూహిక ప్రార్థనలు



ముస్తాబైన కరుణగిరి చర్చి

అమిత్‌షాను తొలగించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేంద్రసాహు, ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ గురించి అవహేళనగా మాట్లాడిన మాటలు చాలా బాధాకరమన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎం.పుల్లయ్య, అయితగాని శ్రీనివాస్ గౌడ్, మిర్యాల నాగరాజు, విజయ్‌కుమార్, బి.ఉపేందర్, దారెల్లి రమేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

తిరుమలాయపాలెం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడులో మదర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు దుస్తులను ఎస్‌ఐ జగదీష్ పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. శాంతిభద్రతలలకు ప్రజలు సహకరించాలని కోరారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, మాజీసర్పంచ్ ఎం.ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. నిరుపేదలను గుర్తించి సంక్షేమపథకాలుఅందేలాచూడాలన్నారు.ఈకార్యక్రంమలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

టేకులపల్లి నుంచి శ్రీశ్రీసర్కిల్‌కు వంతెన నిర్మించాలి

ఖమ్మంటౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లిలోని కేసీఆర్ టవర్స్ డబుల్‌బెడ్‌రూంల నుంచి శ్రీశ్రీ సర్కిల్ వద్ద బైపాస్‌రోడ్ ఎక్కేందుకు గతంలో ఉన్న ఎయిర్‌పోర్ట్ రహదారిని పునరుద్ధరించి, ఎన్నెస్పీ కాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం సీపీఎం ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక ప్రజలతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు యర్రా శ్రీకాంత్, దొంగల తిరుపతిరావు మాట్లాడుతూ అక్కడ 1200 కుటుంబాలు నివశిస్తున్నారన్నారు. సమీపంలోని లక్ష్మీపురంలో 600కుటుంబాలు నివశిస్తున్నారన్నారు. వారంతా ఖమ్మం రావాలంటే టేకులపల్లి బ్రిడ్జి మీదుగా రావాలన్నారు. ప్రస్తుతం ఆ రహదారి విపరీతమైన రద్దీతో ఉంటుందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.

పామాయిల్ సాగు విస్తరణపై దృష్టి

కూసుమంచి ఏవో వాణి

కూసుమంచి,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పామాయిల్ సాగు విస్తరణపై దృష్టిసారించిందని కూసుమంచి మండలం వ్యవసాయ అధికారి వాణి తెలిపారు. మండలంలోని నేలపట్ల, అగ్రహారం గ్రామాల్లో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నీటివసతి బాగా ఉన్న ప్రాంతాల్లో ఈపంట సాగుచేసుకోవచ్చని, ఎకరం వరి సాగుచేసుకునే నీటితో మూడెకరాల పామాయిల్‌ను సాగు చేసకోవచ్చని తెలిపారు. పంటసాగుచేసిన నాలుగో ఏట నుంచి 20ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి,పత్తి, మిర్చి వంటి పంటలలో ఎదురవుతున్న కూలీలసమస్యను అధికమించవచ్చని అన్నారు. ఏఈవోలు ప్రియాంక, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నేలపట్లలో రైతులతో మాట్లాడుతున్న ఏవో వాణి

పోలీసు అధికారులకు సీపీ అభినందన

ఖమ్మంక్రైం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాధారాలు సేకరించి చర్యలు చేపట్టిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం వారికి రివార్డులు అందించారు. 2019 సెప్టెంబరు 10న రాజకీయ వివాదాల నేపథ్యంలో పెనుబల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని బ్రహ్మాలకుంటలో ఓహత్య జరిగింది. ఈకేసులో ఆరుగురికి జీవితఖైదు రూ.10వేల జరిమానా, ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష రూ.5వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి కోర్టులో తీర్పు ఇచ్చారు. ఈసందర్భంగా మంగళవారం సీఐలు ముత్తులింగయ్య, టి.రవికుమార్, కరుణాకర్, ఎస్‌ఐలు వెంకటేష్, నాగరాజు, అసిస్టెంట్ పీపీ అబ్దుల్‌పాషా, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ గిరి, హోంగార్డు సురేష్‌లను సీపీ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి సేవలందించాలన్నారు.



అధికారులను అభినందిస్తున్నసీపీ సునీల్‌దత్

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):వైద్యసిబ్బంది స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి పేర్కొన్నారు. మంగళవారం మంచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని ధంసలాపురం ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో ఆమే పాల్గొన్నారు. రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లే దవాఖానాల్లో అన్నిరకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. మున్నేరు వరదల కారణంగా ఆరోగ్య ఉప కేంద్రంలో పాడైపోయిన పరికరాలు, రికార్డులను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఏఎన్‌ఎం రాధాకు పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. జిల్లా ఉప వైద్యాధికారి బెజవాడ సైదులు, వైద్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి కళావతిబాయి



2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాం నిర్మిస్తాం

» ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి

కల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తుల నిల్వలను దృష్టిలో ఉంచుకొని కల్లూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గోదామును నిర్మించాల్సిన అవసరం ఉందని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి అన్నారు. మంగళవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. వాటి నిర్మాణాల అనుమతి కోసం ఉన్నత అధికారులకు నివేదిక పంపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏవో ఎం. రూప, మార్కెట్ కమిటీ కార్యదర్శి పంతులు, సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, సూపర్‌వైజర్ జగదీష్‌కుమార్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ నీరజదేవి

ఆకట్టుకుంటున్న 'స్త్రీ శక్తి' లోగో టీ స్టాల్

» ఐకేపీ చేయూతతో స్వయం ఉపాధికి నారీశక్తి శ్రీకారం



టీస్టాల్ పై ఉన్న స్త్రీ శక్తి లోగో

బోనకల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): అత్యున్నత చదువులు చదివినా, వారి చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకక, దూర ప్రాంతాలకు వలస వెళ్లి చిన్నా, చితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూన్న పరిస్థితులే ఎక్కువగా ఉన్నాయి. పెళ్లి, పిల్లలతో దాంపత్య జీవనం సాగిస్తూ భర్త సంపాదన పైనే ఆధారపడే గృహిణులను చూస్తుంటాం. కాని కాలనుగుణంగా వచ్చిన మార్పులలో భాగంగా ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. మహిళలకు ప్రోత్సాహం అందించి వారికి స్వయం ఉపాధిని కల్పించాలని బృహత్తర కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఐకేపీ ద్వారా రుణాలను అందించి ప్రభుత్వ స్థలంలో చిన్న తరహా టీ స్టాల్‌ను ప్రారంభించడం అందరిని ఆలోచింపచేస్తుంది.

ప్రత్యేకమైన ఆకర్షణతో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి లోగో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఐకేపీ ద్వారా ఇచ్చిన రూ.1.80 లక్షల రుణంతో రావినూతల గ్రామానికి చెందిన షేక్ రెహనాబేగం మండల పరిషత్ కార్యాలయం పక్కన గల ప్రభుత్వ స్థలంలో టీ స్టాల్‌ను నిర్వహిస్తుంది. ఈనెల 14న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీ స్టాల్‌ను ప్రారంభింపజేశారు. అన్ని రకాలుగా, రుచికరమైన టీలను అందిస్తుండటంతో టీ ప్రియులు అక్కడకు వస్తున్నారు. టీలతో పాటు జ్యూస్‌లు, స్నాక్స్ సీజన్‌కు దగ్గట్టుగా ముందు వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.



టీ విక్రయిస్తున్న రెహనాబేగం

ఐకేపీ ప్రోత్సాహకంతో టీ స్టాల్ నిర్వహణ

● షేక్. రెహనాబేగం, రావినూతల



ఐకేపీ ప్రోత్సాహకంతో టీ స్టాల్ పెట్టుకున్నాను. స్వయం ఉపాధి పొందేందుకు, మహిళలకు చేయూతను ఇచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. స్త్రీ శక్తి లోగో డిజైన్ చాలా బాగుంది. మహిళల్లో చైతన్యం నింపేలా ఉంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా అందరూ ప్రోత్సాహం ఇవ్వాలి.



నూతన వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

ఏసు చూపిన మార్గంలో పయనించాలి: ఎమ్మెల్యే

సత్తుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు సూచించిన సన్మార్గంలో ప్రయాణించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం సత్తుపల్లిలో 50మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్, హోప్ మినిస్ట్రీస్ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సింగరేణి కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు అలవాల కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి సన్మానం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన పట్టణానికి చెందిన చల్లగుళ్ల పరమేశ్వరిని మంగళవారం స్థానిక శ్రీ బండి పార్థసారథి గ్రంథాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఉద్యోగం సాధించేందుకు గ్రంథాలయంలో పుస్తకాలు ఎంతగానో ఉపకరించాయని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నక్కా మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా పరమేశ్వరి ప్రస్తుతం భద్రాద్రి జిల్లా పినపాక మండలం గడ్డిగూడెం హైస్కూల్‌లో స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మధిర బార్ అసోసియేషన్ సభ్యులు

మధిర, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి రూపొందించిన కోర్టు నూతన సంవత్సరం 2025 డైరీని మధిర కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. కోర్టుసమాచారంతో సభ్యులకు ఉపయోగపడే విధంగా సంపూర్ణ క్యాలెండర్‌గా ఈ డైరీ రూపొందించడం జరిగిందని ఈసందర్భంగా సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు బొజెడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, దిరిశాల జగన్‌మోహన్‌రావు, నంబూరి జనార్ధన్‌రావు, చింత గోపాల్, కట్టా పూర్ణచంద్రరావు, కావూరి రమేష్, కోటా జ్ఞానేష్, నెల్లూరి రవి, జే రమేష్, ఎం సతీష్, కె విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అకాల వర్షాలు

ఏన్కూరు/వైరా/ముదిగొండ/కారేపల్లి/తల్లాడ, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షపు జల్లులు కురుస్తుండటంతో అన్నదాతల పరిస్థితి అగమానంగా తయారైంది. రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన వరిధాన్యాన్ని కోసి కల్లాలు, రోడ్లపై ఆరబోశారు. ఒక్కసారిగా కురిసిన వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరికి మంగళవారం వర్షపుజల్లులు ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకొనేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



వైరాలో పట్టాలపై నిలిచిన వర్షపునీటిని బయటకు తీస్తున్న రైతు



ఏన్కూర్‌లో ధాన్యాన్ని దగ్గరకు చేరుస్తున్న రైతులు

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి: ఏడీఏ

బోనకల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోసం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు పాటించి లాభాలు సాధించాలని మధిర ఏడీఏ విజయచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలోని మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో మొక్కజొన్న పంటను నవంబర్ నెలలో విత్తుకుంటే మంచిదన్నారు. అలస్యంగా సాగుకు దిగితే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అంతర పంట లేదా కంచె పంటగా నేపియర్ గడ్డిని వేసుకుంటే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మరీదు త్రివేణి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ ఆరుగురికి గాయాలు

వైరా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరా నది హైలెవల్ వంతెనపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇరుకు వంతెనలో రెండు కార్లు ఇరుక్కుపోవడంతో జాతీయ ప్రధాన రహదారిలో రోడ్డుకు రెండు వైపుల దాదాపు ఐదు కిలోమీటర్లు ట్రాఫిక్ స్తంభించిపోయింది. వైరా పోలీసులు ప్రమాదానికి గురైన రెండు కార్లను తొలగించిన తర్వాత దాదాపు గంటసేపటికి ట్రాఫిక్ క్లియర్ అయింది. తల్లాడ వైపు నుంచి వస్తున్న ఒక కారు వైరా నుంచి తల్లాడ వెళ్తున్న కారు హైలెవల్ వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద సమయంలో కార్లలోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఒక కారులోని ఖమ్మంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అఖిల్, లోకేష్, భాను, ప్రకాష్, హర్షన్, ప్రేమ్ కుమార్ గాయపడ్డారు. గాయపడిన ఆరుగురిని 108వాహనంలో ఖమ్మం తరలించారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వితంతువులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న గ్రేస్ సంస్థ నిర్వాహకులు, అధికారులు

బోనకల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం గ్రేస్ సేవా సొసైటీ సభ్యులు క్రిస్మస్ సందర్భంగా 1500 మంది వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, ఎస్ఐ మదుబాబు, పాస్టర్ ఎర్నెస్ట్‌పాల్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వారంలో 500 మంది పాస్టర్లకు దుస్తులు, బియ్యాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. ఇప్పటికే గ్రేస్ సేవా సంస్థ ద్వారా గ్రామాలలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

'క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలి'

మధిరటౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు క్రిస్మస్ అతి ముఖ్యమైన పండుగ అని దీనిని అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత అన్నారు. మంగళవారం మధిర మునిసిపల్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కమిషనర్ సంపత్ కుమార్, డీఈ నరేష్‌రెడ్డి, టీపీఎస్ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్, తదితరులున్నారు.



కేక్‌కట్ చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత

తల్లాడ, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురంలో మంగళవారం కారుణ్య సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 150మంది విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులను సొసైటీ వ్యవస్థాపకుడు జి.బాలారెడ్డి, అధ్యక్షురాలు ఝాన్సీ పంపిణీ చేశారు. క్రిస్మస్ భక్తి గీతాలను డి.జోజి, టి.ఆంధ్రప్ప ఆలపించారు. కార్యక్రమంలో ఉపదేశకులు డి.సంతోష్, తిరుపతమ్మ, నరేష్ పాల్గొన్నారు.



బహుమతులు పంపిణీ చేస్తున్న బాలారెడ్డి

మధిర ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

మధిర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి మధిర వస్తున్న మధిర ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 04యూడీ 2345నెంబరు ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు మంగళవారం అదుపు తప్పి సిరిపురం దాటిన తర్వాత ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలో రోడ్డు పక్క ముళ్ల కంపల్లోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు దూసుకుపోయింది. బస్సులో 55మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. కాగా ఈ ప్రమాదంలో ఎవ్వరికి గాయలు కాలేదని డిపో మేనేజర్ శంకర్‌రావు తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

వైరా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడులో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో మంజూరైన రూ.64లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, గరికపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం సురేందర్‌రెడ్డి, నాయకులు దొడ్డా పుల్లయ్య, గడిపూడి రామకృష్ణ, బోళ్ల గంగారావు, పల్లపు కొండలు, పమ్మి అశోక్, గోసు రాధాకృష్ణ, రేమల్ల దావీదు, అయిలూరి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయం



సత్తుపల్లిలో పాస్టర్లకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/వేంసూర్/కల్లూరు/తల్లాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక విలువలు చైతన్యవంతం కావాలంటే క్రీస్తు బోధించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయమని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మంగళవారం ఆయా మండలాల్లో, పట్టణాలలో మిఠాయిలు అందజేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణ, క్షమాగుణాలను తన జీవిత సందేశంగా మానవాళికి అందించిన ఏసుక్రీస్తు జన్మించిన పర్వదినం క్రిస్మస్ అన్నారు. ఈ పవిత్ర పండుగ తరుణాన క్రైస్తవ మత అరాధకులందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో కార్యక్రమంలో సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ముస్తాబైన చర్చీలు



దుకాణాల వద్ద వివిధ రకాల స్టార్స్



తనికెళ్లలో విద్యుత్ కాంతులతో పునీత సెశీలియమ్మ చర్చి



సత్తుపల్లి రూరల్: జ్యోతినిలయం వద్ద పశువుల పాక సెట్టింగ్



ఆర్‌సీఎం చర్చి లోపల అలంకరిస్తున్న దృశ్యం

నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలను దోచుకునేందుకు నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని కేంద్రప్రభుత్వం అమలుచేస్తుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానానికి నిరసనగా మంగళవారం వైరాలో జాతీయ ప్రధాన రహదారిపై కేంద్రప్రభుత్వం జారీ చేసిన మంజూరు పత్రాలను దహనం చేశారు. వెంటనే నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెంపాటి రామారావు, బాణా ల శ్రీనివాసరావు, బొంతు సమత, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, నర్సింహారావు, సీతరాములు, మహేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేపు మర్లపాడులో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

వేంసూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మర్లపాడులోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



షిర్డీసాయిబాబా ఆలయం